# విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు అభినందనతో సన్మానం చేస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, మే 8 ప్రభాతవార్త:** విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవడమే కాకుండా క్రీడలు, వ్యాయామం పట్ల శ్రద్ధ పెట్టి సమతుల్యతను పాటించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ఇటీవల వచ్చిన 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు గురువారం ఐడిఒసి సమావేశ మందిరంలో అభినందన, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారని అందువల్లనే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించారని అభినందించారు. ముఖ్యంగా జిల్లా నుండి అమ్మాయిలు అధిక సంఖ్యలో ఉత్తీర్ణత సాధించడం, అత్యధిక మార్కులు అమ్మాయిలే సంపాదించడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న 3 గిరిజన అమ్మాయిలు జేఈఈ మెయిన్‌కు ఎంపిక అయ్యారని వారికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఇప్పుడు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు తమ పాఠశాలల్లో ప్రస్తుతం చదువుకున్న విద్యార్థులకు స్ఫూర్తిదాయకులనీ మండల విద్యా అధికారులు పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలని సూచించారు. విద్యార్థులకు ఇది ప్రారంభం మాత్రమే అని భవిష్యత్తులో చదువుతో పాటు వ్యాయామం, క్రీడల్లో పాల్గొంటూ చదువుతో పాటు ఆరోగ్యాన్ని సంతులనం పాటించాలని సూచించారు. సన్మానం పొందుతున్న విద్యార్థులు భవిష్యత్తులో ఐఐటి, ఎయిమ్స్‌లో సీట్లు సాధించే విద్యార్థులకు తన ఇంట్లో భోజనానికి ఆహ్వానిస్తానని అన్నారు. జిల్లా నుండి ఉత్తమ మార్కులు పొందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు సైతం కలెక్టర్ చేతుల మీదుగా మొత్తం 50 మంది విద్యార్థులకు సన్మానం చేశారు. విద్యార్థులకు మెమెంటో తో పాటు వారి జీవితంలో ఉత్తేజపరిచే విధంగా ఎపిజె కలాం రాసిన ఇగ్నేటెడ్ మైండ్స్ పుస్తకాని బహుకరించారు. జిల్లా విద్యా అధికారి అబ్దుల్ గని, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఎ.అంజయ్య, ఏసిజి గణేష్, మండల విద్యా అధికారులు, ప్రినిపాల్స్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్



సమీక్ష సమావేశంలో పథకాలపై సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, మే8 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మొదటి విడతలో మంజూరు అయిన ఇళ్లు త్వరగా గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఎంపీడీఓలను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం ఐడిఒసి సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపిఒలు, మున్సిపల్ కమిషనర్లతో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, ఉపాధి హామీ పథకం, వర్షాకాలంలో అంటురోగాలు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల జనవరి 26న మొదటి విడతలో ప్రతి మండలం నుంచి ఒక్కో గ్రామానికి పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని1300 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో ఇప్పటి వరకు గ్రౌండింగ్ చేసిన వివరాలు, మరికొన్ని పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను ఒక్కో మండలం వారీగా సమీక్ష నిర్వహించారు. ఎవరైతే ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభించుకోలేదో వారితో రాత పూర్వకంగా ఇష్టం లేదని రాయించుకోవాలని సూచించారు. ఎవరైనా మాకు ఇష్టం లేదు అంటారో వారి నుండిలిఖిత పూర్వకంగా రాయించు కోవాలని ఆదేశించారు. ఇష్టం లేనివారి స్థానంలో ఇతర పేద కుటుంబాలకు అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. రెండవ విడతలో భాగంగా ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా లక్ష్యం మేరకు ప్రత్యేక అధికారులు స్క్రూటినీ చేసిన జాబితాను కలెక్టర్ లాగిన్‌కు త్వరగా పంపించాలని ఆదేశించారు. రాజీవ్ యువవికాసం ఆయా సంక్షేమ శాఖల ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా స్క్రూటినీ చేసి జాబితాను బ్యాంకులకు అందజేయాలని, ఈ ప్రక్రియ మే 15 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులు నిరుపేద కుటుంబం సభ్యులై ఉండాలని అదేవిధంగా ఖచ్చితంగాయూనిట్ నెలకూల్పేవిధంగా చూసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం జిల్లాలో 2025,26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ కూలీలకు 15 లక్షల పని దినాలు కల్పించేందుకు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు కేవలం 2.60 లక్షల పని దినాలు మాత్రమే కల్పించామని ఇప్పుడు రోజుకు 40 వేల పని దినాలు కల్పిస్తే తప్ప లక్ష్యాన్ని చేరుకోలేమని సూచించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులను గుర్తించి అత్యధికంగా లేబర్‌ను పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేబర్ కాంపొనెంట్ పెంచడం ద్వారా మెటీరియల్ కాంపోనెంట్ ఎక్కువగా వస్తాయని తెలియజేశారు. ఈసారి మెటీరియల్ కంప్లైంట్ కింద గ్రామపంచాయతీ భవనాలు అంగన్వాడిభవనాల నిర్మాణాలకు అవకాశం ఉంటుందని చెప్పారు. వచ్చే హరిత వనోత్సవంలో ప్రతి గ్రామానికి వచ్చి పోయే దారిలో 6 అడుగుల ఎత్తుగల అందమైన మొక్కలు నాటాలి. సీజనల్ వ్యాధుల కట్టడి వర్షాకాలంలో దోమల వల్ల డెంగ్యూ మలేరియా డయేరియా వంటి వ్యాధులు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధంచేసుకోవాలని సూచించారు. ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులను ప్రతి నెల 1,11, 21 తేదీలలో శుభ్రం చేసే విధంగా చూసుకోవాలని తెలిపారు. బ్లీచింగ్ పౌడర్ వాగింగ్ మిషిన్లు, సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, పిడి డిఆర్డిఓ ఉమాదేవి, లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.



# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

◆ కార్యకర్తలు పారదర్శకంగా పనిచేయాలి
◆ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి
◆ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**వంగూరు, మే 8 ప్రభాతవార్త:** గ్రామాలలో జీవనం కొనసాగిస్తున్న ప్రజలలో గూడు నిర్మించుకోలేని నిరుపేద కుటుంబాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి అవకతవకలులేకుండా నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను అందించే విధంగా కార్యకర్తలు నాయకులు పనిచేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన వంగూరు మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలను ప్రవేశపెట్టి నిరుపేదలకు గృహ నిర్మాణం, యువకులకు జీవనోపాధి కల్పించేందుకు రుణాలను అందిస్తుందని, ఈ పథకాలలో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా పార్టీ కార్యకర్తలు పారదర్శకంగా నివేధికలను తయారు చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ రాష్ట్ర అభ్యున్నతి కోసం కృషి చేస్తుందని, ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, రుణమాఫీ, రైతు బంధు పథకాలను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రజలకు అందుబాటులో ఉంటూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. టీపీసీసీ ఆదేశానుసారంగా గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రాజీవ్ యువవికాసం, సంక్షేమ పథకాలపై కార్యకర్తలతో చర్చించారు. మండలంలోని ప్రతి గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ కొత్త కమిటీని ఏర్పాటు చేయాలని నాయకులకు ఆదేశించారు. వీలైనంత త్వరగా ప్రతి గ్రామంలో మండల కమిటీ భాద్యతగా పర్యటించి గ్రామ కమిటీలు

–మిగతా4లో..

## చరిత్రకు ఆనవాళ్లుగా ఉండే కట్టడాలను కాపాడుకుందాం!



పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్కిటెక్ బృందం

◆ పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధీకరణకు, రాజప్రసాదం పునరుద్ధరణపై ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ
◆ బంగ్లాను పరిశీలించిన ముంబై ఆర్కిటెక్చర్ సరయు మోరే

4

## ధాన్యం కొనుగోళ్లలో సర్కారు విఫలం



గన్ని బ్యాగులు లేక నిలిచిపోయిన కొనుగోళ్లు

● సీఎంకు అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ.. అన్నదాతలపై లేదని మండిపాటు
● ధాన్యం కొనుగోలు చేయకపోతే నిరసనలు చేస్తాం
● బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ బాసు హనుమంతు నాయుడు

2

## 16న ప్రపంచ సుందరిమణులు పిల్లల మర్రి సందర్శన

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్



**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 8 ప్రభాతవార్త:** మే 16న వివిధ దేశాలకు చెందిన ప్రపంచ సుందరీ మణుల కంటెస్టెంట్స్ ఈనెల 16 వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం పిల్లల మర్రి పర్యటన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమష్టిగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశించారు. గురువారం పిల్లల మర్రిలో అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించి సమర్థ నిర్వహణకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లు సుమారు 750 సంవత్సరాల చరిత్ర గల, పిల్లల మర్రి మర్రి వృక్షం, అక్కడే ఉన్న పురావస్తు మ్యూజియం, మ్యూజియం పక్కన గల శ్రీ రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంను సందర్శించనున్నారు పర్యాటక ప్రాంతం వద్ద స్వాగత ఏర్పాట్లు, సౌండ్ అండ్ లైటింగ్, ఏర్పాటు తగినంత వెలుతురు, పటిష్ట భద్రత, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కింగ్ తదితర ఏర్పాట్ల నిర్వహణకు అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డి.జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్.పి.రాములు, డీఎస్పీ వేంకటేశ్వర్లు, డిఎఫ్ఓ సత్యనారాయణ, డిఆర్‌డిఓ నరసింహులు, నగరపాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఆర్డీవో నవీన్, డిఈఓ ప్రవీణ్ కుమార్, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 8 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గురువారం సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను, పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉంటూ, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రవికుమార్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# భూ సమస్యల సత్వర పరిష్కారానికై రెవెన్యూ సదస్సులు

● గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ
● 58 భూ సమస్యల కొరకు దరఖాస్తులు



సాతర్ల రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్



రైతుల నుండి భూ సమస్యలను తెలుసుకుంటున్న జేసీ, ఆర్డీఓ, తహసీల్దార్

**ఇటిక్యాల, మే 8 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూభారతి 2025 ఆర్ఓఆర్ చట్టం ప్రకారం గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకుగాను రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని ఈ సదస్సు ద్వారా కొన్ని భూసమస్యలకు మీ సేవలో చెల్లించే డబ్బులు కూడా రైతులకు మిగిలిపోనున్నాయని పైలెట్ ప్రాజెక్టు ద్వారా భూ సమస్యల పరిష్కారానికి అవగాహన కలుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, ఆర్డిఓ శ్రీనివాసరావు రైతులకు వివరించారు గురువారం ఇటిక్యాల మండలంలోని సాతర్ల గ్రామంలో రైతు వేదికలో తహసిల్దార్ వీరభద్రప్ప ఆధ్వర్యంలో జరిగిన రెవిన్యూ సదస్సుకు జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్. ఆర్డిఓ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు భూ సమస్యలను జెసి. ఆర్డిఓ దృష్టికి తీసుకుపోయి సమస్యను చెప్పుకున్నారు. అలాగే పలువురు రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ భూభారతి విధివిధానాల గురించి, చట్టంలో పొందుపర్చిన అంశాలపై అవగాహన కల్పించారు. ధరణిచట్టం వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టం తెచ్చిందని తెలిపారు. 12 రాష్ట్రాలలో మేధావులు, అధికారులు పర్యటించి అధ్యయనం చేసి, గత నెల 14వ తేదీ డా.బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున ప్రభుత్వం ఈ చట్టాన్ని ప్రారంభించిందని చట్టం రూపొందించే సమయంలో రైతుల సంక్షేమం కోసం వారి సమస్యలను ప్రస్తావించి, అభిప్రాయాలను చట్టంలో చేర్చేందుకు చర్యలను ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి స్థానంలో అందులో ఉన్న అంశాలలో రెవెన్యూ అధికారులకు ఎలాంటి అధికారాలు ఇవ్వలేదని కొత్త భూభారతి చట్టంలో తాహసిల్దార్ తప్పు చేస్తే ఆర్డిఓకు ఆర్డిఓ తప్పు చేస్తే కలెక్టర్‌కు కలెక్టర్ తప్పు చేస్తే ట్రిబ్యునల్ కోర్టుకు అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉందని రైతులకు వివరించారు. గతం నుండి భూ సమస్యలు పరిష్కారం కానీ రైతులకు రెవెన్యూ సదస్సు ద్వారా దరఖాస్తులు ఇచ్చి రైతులు ఎటువంటి ఫీజు లేకుండా తమ భూ సమస్యల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, ఆన్ లైన్ లో నమోదు చేసి క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన తర్వాత గడువులోగా రైతుల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ సూచించారు. 50 శాతం తాహసిల్దార్ కార్యాలయంలో. 30 శాతం ఆర్డిఓ స్థాయిలో మరో 20 శాతం కలెక్టర్ స్థాయిలో రైతుల భూ సమస్యలు పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో ఇటిక్యాల మండలం ఎంపికైందని ఇక్కడ వ్యవసాయం మీద ఆధారపడిన మండలం కావడంతో ఈ మండలాన్ని ఎంపిక చేసామని అందుకు గ్రామాలలోకే అధికారులు వచ్చి మీ నుండి దరఖాస్తులను తీసుకునేందుకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశామని సదస్సులు ముగిశాక, జిల్లాలోని అన్ని మండలాల్లో అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని రైతులు, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాతర్ల గ్రామంలో మొత్తం 58 దరఖాస్తులు వివిధ భూ సమస్యల కొరకు రైతులు దరఖాస్తులు చేసుకున్నారని ఓఆర్‌సి కొరకు 14. డిజిటల్ సంతకం 4 మిస్సింగ్ సర్వే నంబర్ 4, పెండింగ్ మ్యూ టేషన్ 2, ఇతర భూ సమస్యల కొరకు రైతుల నుండి దరఖాస్తులు తీసుకున్నట్లు తాహ సిల్దార్ వీరభద్రప్ప తెలిపారు ఈ సదస్సులో ఆర్డిఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ వీర భద్రప్ప, ఎర్రవల్లి తహసీల్దార్ నరేష్, డిప్యూటీ తాహసిల్దార్ నందిని, సీనియర్ అసిస్టెంట్‌లు మనోహర్, నరేష్, ఆర్ఐలు మదన్ మోహన్, గురురాజా కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ, జయ చంద్రారెడ్డి, గ్రామ వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలి

● జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

**గద్వాల, మే8 ప్రభాతవార్త :** ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులకు ఆదేశించారు. గురువారం గట్టు మండలంలోని ఆరగిద్ద గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలో ఇండ్ల నిర్మాణం పనులు ఎలా జరుగుతున్నాయని లబ్ధిదారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణపు పనులను వేగవంతంగా పూర్తి అయ్యేవిధంగా లబ్ధిదారులను ప్రోత్సహించాల్సిందిగా పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని తెలిపారు. తదనంతరం ఆరగిద్ద గ్రామంలో అమలవుతున్న ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న చెక్ డ్యామ్‌ను, నాణ్యత ప్రమాణాలు, పనుల పురోగతిని సమీక్షించారు. పనులు వేగంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. అనంతరం

–మిగతా4లో

## నీటిపారుదల రంగంపై ప్రత్యేక దృష్టి

● రూ.1323 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు
● వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మే8 ప్రభాతవార్త :** వనపర్తి నియోజకవర్గ పరిధిలో నీటిపారుదల రంగాన్ని పూర్తిస్థాయిలో పటిష్టపరిచేందుకు రూ. 13 వందల 23 కోట్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తెలిపారు. గురువారం వనపర్తి జిల్లా సిఇ కార్యాలయం నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ పరిధిలో ఏర్పాటుచేసే రిజర్వాయర్లు, కాలువలు, లిఫ్టులతో పాటు అనేక మరమ్మత్తులను దృష్టిలో ఉంచుకొని రూ. 1323 కోట్లకు సంబంధించిన ప్రతిపాదనలను

–మిగతా4లో..



నీటిపారుదల శాఖ అధికారుల రివ్యూ మీటింగ్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

## కొనసాగుతున్న ఇంటర్వ్యూలు



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

**ఉప్పునుంతల, మే8 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం స్కీం కోసం షెడ్యూల్ తెగలకు చెందిన 352 మంది ఎస్టీ కార్పొరేషన్ కు దరఖాస్తులు చేసుకున్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలో భాగంగా రెండో రోజైన గురువారం మండల కేంద్రమైన ఉప్పునుంతల ఎంపిడిఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్టీ కార్పొరేషన్ కింద వివిధ పథకాల కోసం 352 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 211 మంది హాజరయ్యారు. హాజరైన 211 మంది సర్టిఫికెట్లను పరిశీలించినట్లు ఎంపీడీఓ మోహన్‌లాల్ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు ఎంపీడీఓ మోహన్ లాల్‌తో పాటు మండల పంచాయతీ అధికారి నారాయణ, ఐకెపి ఏపిఎం తిరుపతయ్య, టిజిబి బ్రాంచ్ ఉప్పునుంతల, వెల్టూర్, ఎస్‌బిఐ అచ్చంపేట, డిఆర్‌డిఎ ప్రతినిధులు, ఎస్టీ కార్పొరేషన్ ప్రతినిధులు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. 12న బిసి లకు ఇంటర్వ్యూలు రాజీవ్ యువ వికాసం స్కీం కోసం బీసీ కార్పొరేషన్ కు దరఖాస్తు చేసుకున్న బీసీలకు 12న సోమవారం ఉదయం 10:30 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌లాల్ పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే నిరుద్యోగ యువతీ యువకులు సర్టిఫికెట్లు ఒరిజినల్ తీసుకొని రావాలని ఆయన సూచించారు.

## సత్యేశ్వర ఆశ్రమంలో అన్నదానం

■ ఘనంగా బిఆర్ఎస్ యువ నాయకుడు స్వరణ్ జన్మదిన వేడుకలు



ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**జడ్చర్ల, మే 8 ప్రభాతవార్త:** మాజీ మంత్రి డా.సి. లక్ష్మారెడ్డి కుమారుడు స్వరణ్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు ఈటె శ్రీను ఆధ్వర్యంలో జడ్చర్ల సత్యేశ్వర సేవా ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు, బిఆర్ఎస్ నాయకులు స్వరణ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నదానం నిర్వహించిన ఈటె శ్రీనుని ఆశ్రమనిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను కాలరాస్తే సహించేది లేదు

**మక్తల్, మే 8 ప్రభాతవార్త:** దేశంలోని సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మిక హక్కులనుకాలరాసే విధంగా కేంద్రప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను అమల్లోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని, దీంతో కార్మిక వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరాజు అన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తే ఏమాత్రం సహించేది లేదని ఆయన అన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మక్తల్ మండలంలోని కర్ని పిహెచ్‌సి వద్ద ఆశాకార్యకర్తలతో కలిసి వైద్యాధికారి తిరుపతికి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు గోవిందమ్మ, యశోద, అమీనా బేగం, ఇందిరా, అనిత, సుజాత, రాధిక, సావిత్రమ్మ, లక్ష్మి, మహేశ్వరి, పార్వతమ్మ, వెంకటలక్ష్మి, వెంకటమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఘన సన్మానం



క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్, మే 8 ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను గురువారం డివైఎస్ఓ వెంకటేష్ శెట్టి ఘనంగా సన్మానించారు. మక్తల్ పట్టణంలోని ఈనాడు లక్ష్యకోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి క్రీడాకారులకు మెళకువలను వివరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు విశాలాక్షి, అలేఖ్య, రాజేశ్వరి, రాఘవేంద్ర, శివకుమార్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కోచ్ జగదీష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**ఖిల్లాగణపురం. మే 8 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మామిడివాడ గ్రామంలో నిరుపేదలైన దళితులకు డబల్ బెడ్ రూములు కేటాయించాలని బిజెపి నాయకులు గురువారం తహసిల్దార్ సుగుణకు ఫిర్యాదు చేశారు. ఇటీవల మామిడివాడ గ్రామంలో అధికార పార్టీకి చెందిన కొందరు డబల్ బెడ్ రూములు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేశారని తహసిల్దార్ కు వివరించారు. అలా కాకుండా నిరుపేదలైన దళితులకు అర్హులైన వారందరికీ విచారణ జరిపించి డబల్ బెడ్ రూములు కేటాయించాలని తాసిల్దారును కోరారు. అదేవిధంగా డబుల్‌బెడ్ రూములు అందజేస్తామని దళితుల తో వసూలు చేసిన డబ్బులు వారికి తిరిగి ఇప్పించాలని కోరారు. ఈ విషయమై తాసిల్దార్ మాట్లా డుతూ కలెక్టర్‌కి అన్ని రిపోర్టు అందజేశామని కలెక్టర్ ఆదేశానుసారం దళితులందరికీ న్యాయం చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు సీతారాములు, మండల పార్టీ అధ్యక్షులు బుచ్చిబాబుగౌడ్, నవీన్ రెడ, దళిత మోర్చా, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, యువ మోర్చా, జిల్లా నాయకులు గోపి ముదిరాజ్, బిజెపి పార్టీ సీనియర్ నాయకులు రవీంద్రా చారితో పాటు పలువురు బిజెపి నాయకులు తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు

## జోన్ చైర్ పర్సన్‌గా దొడ్ల రాధారెడ్డి



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 08 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ లయన్స్‌క్లబ్ ప్రస్తుత అధ్యక్షులుగా దొడ్ల రాధారెడ్డి జోన్ చైర్మన్‌గా నియమితులు అయ్యారు. క్లబ్ అధ్యక్షురాలిగా పురుషులకు ధీటుగా సమర్థవంతంగా నిర్వహించినందుకు కాబోయే లయన్స్ గవర్నర్ డాక్టర్ మహేంద్ర కుమార్ రెడ్డి రాధారెడ్డిని జోన్ చైర్ పర్సన్‌గా నియమించారు. ఈ మేరకు గోవాలో నిర్వహించిన జోన్ చైర్మన్‌ల శిక్షణకు హాజరు అయి శిక్షణ పూర్తి చేసుకొని ప్రస్తుత గవర్నర్ కోటేశ్వరరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. రాధారెడ్డి జోన్ చైర్ పర్సన్‌గా నియమితులు అయినందుకు క్లబ్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ మరియు మాజీ అధ్యక్షులు, క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.

## ప్రతి మొక్కను బ్రతికించాలి: ఏపీఓ

**వెల్దండ, మే 08 ప్రభాతవార్త:** వననర్సరీలో పెంచుతున్న ప్రతి మొక్కను బ్రతికించాలని ఏపీఓ ఈశ్వర్‌జీ అన్నారు. వెల్దండ మండలంలోని కొట్ర గ్రామంలోని నర్సరిని పర్శిలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలన్ని దృష్టిలో ఉంచుకొని మొక్కలకు సరైన సమయంలో నీరు పట్టాలన్నారు. మొక్కలు ఎండి పోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వచ్చే వర్షకాలం నాటికి సిద్ధం చేయాలన్నారు.

# పదవ తరగతి ఫలితాలపై కలెక్టర్ సమీక్ష

■ ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందించే విధంగా చర్యలు తీసుకోవాలి : వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



పదో తరగతి ఫలితాలపై సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, మే 8 ప్రభాతవార్త:** వచ్చే సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులతో పదవ తరగతి ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. విద్యా పర్తిగా పేరుగాంచిన వనపర్తి జిల్లా పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో 29వ స్థానం పొందటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని కలెక్టర్ మండిపడ్డారు. ఉత్తీర్ణతలో వెనుకబడ్డ ఉపాధ్యాయులను పిలిపించి శిక్షణ కార్యక్రమం చేపట్టాల్సిందిగా విద్యా అధికారిని ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుతం 9వ తరగతిలో గణితంలో వెనుకబడి ఉన్న విద్యార్థుల జాబితా సేకరించి జూన్12 నుంచి నెల రోజులపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. వచ్చే 10 వ తరగతి వార్షిక పరీక్షల్లో ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కావడానికి వీలు లేదని, ఉపాధ్యాయులు బాధ్యత తీసుకొని విద్యార్థులకు తగిన రీతిలో బోధించాలని ఆదేశించారు. విద్యార్థులు ఫెయిల్ అయితే సంబంధిత సబ్జెక్ట్ ఉపాధ్యాయుడు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లా విద్యా అధికారి అబ్దుల్ ఘని, ఎసిజి గణేష్, మండల విద్యా అధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్‌ల్యాండ్ సర్వేయర్ల శిక్షణకై దరఖాస్తుల ఆహ్వానం

■ లైసెన్సు పొందే అవకాశంతో 2 నెలల శిక్షణ

■ మే 17వ తేదీ లోపు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

■ నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 08 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టం కింద భూమి రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే/సబ్ డివిజన్ మ్యాప్ సమర్పించడం తప్పనిసరిగా మారుతున్నందున, అర్హత కలిగిన అభ్యర్థులు లైసెన్స్డ్ ల్యాండ్ సర్వేయర్ శిక్షణకు ఈ నెల 17వ తేదీలోపు మీ సేవ కేంద్రాల ద్వారా ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా భూమి సర్వే అంటే భూమి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లే ప్రతి దరఖాస్తుదారుడు సీఎస్ఎస్ఎల్ఆర్ ద్వారా తెలియజేయబడిన తేదీ నుండి సర్వే/సబ్ డివిజన్ మ్యాప్‌ను కూడా సమర్పించాల్సి ఉంటుందన్నారు. అయితే సర్వే, ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో అర్హత కలిగిన సర్వేయర్లు సరిపడా సంఖ్యలో లేనందున, 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మంది లైసెన్స్ సర్వేయర్లను అర్హత ప్రాతిపదికన ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. లైసెన్సు సర్వేయర్‌గా ఎంపికైన వారు నెలకు సుమారు 30వేల రూపాయలకు పైగా ఆదాయం పొందేందుకు అవకాశంఉంటుందని కలెక్టర్ సూచించారు. లైసెన్స్ సర్వేయర్‌గా ఎంపికైన వారికి జిల్లా కేంద్రంలో ఈ నెల 26 నుండి జూలై 26 వరకు రెండు నెలల పాటు (50 పని దినాలలో) శిక్షణఅందించడం జరుగుతుందన్నారు. శిక్షణ ముగింపులో పరీక్ష ఉంటుందని, ఈ పరీక్షలో థియరీ, ప్లాటింగ్ అండ్ ప్రాక్టికల్ అనే మూడు భాగాలు ఉంటాయన్నారు. పరీక్షలోని ప్రతి విభాగంలో 60శాతం ఉత్తీర్ణత సాధించాలని, మొత్తం 3 పేపర్లలో ఉత్తీర్ణత సగటున 70 శాతానికి తక్కువ కాకుండా ఉండాలని తెలిపారు. శిక్షణ పొంది పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన వారు, ప్రభుత్వ సర్వేయర్ కింద40 పని దినాల పాటు శిక్షణ కార్యక్రమంలో భాగంగా అప్రెంటిస్‌షిప్ చేయాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. అప్రెంటిస్‌షిప్ శిక్షణ పూర్తయిన తర్వాత, లైసెన్స్ పొందడానికి డిపార్ట్‌మెంట్ నిర్వహించే అసెస్‌మెంట్ టెస్ట్‌లో అభ్యర్థులు ఉత్తీర్ణులు కావాలన్నారు. అసెస్‌మెంట్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన తర్వాత అభ్యర్థికి లైసెన్స్ ఇవ్వబడుతుందని కలెక్టర్ తెలిపారు. మొదటగా మూడు సంవత్సరాల కాలానికి లైసెన్సు జారీ కోసం అభ్యర్థులు నిర్ణీత రుసుము చెల్లించి సీ.ఎస్.ఎస్.ఎల్.ఆర్ కార్యాలయానికి దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. లైసెన్సు సర్వేయర్ గా ఎంపికైన వారు నెలకు 30వేల రూపాయలకు పైగా ఆదాయంతో కూడిన ఉపాధి పొందవచ్చని అన్నారు. శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 17-05-2025 నాటికి ఓ.సీ, బీ.సీ లు అయితే 18 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 18 నుండి 40 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో గణితం సబ్జెక్టుతో కలిపి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత, లేదా డ్రాఫ్ట్స్‌మన్ (సివిల్) ట్రేడ్‌లో ఎన్.సీ.వీ.టీ సర్టిఫికేట్ మరియు సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, తెలంగాణ. లేదా తత్సమానం నిర్వహించిన ఎస్.ఎస్.సీ పరీక్షలో ఉత్తీర్ణత, లేదా తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన సంస్థ నుండి సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా లేదా డిగ్రీ ఉండాలని, లేదా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డ్ ఆఫ్ సర్వేయర్ మరియు ఎస్టిమేటర్ కోసం ఇంటర్మీడియట్ (వృత్తి) కోర్సులో ఉత్తీర్ణత, లేదా భారతదేశంలోని సర్వేయర్ల సంస్థ నిర్వహించే ల్యాండ్ సర్వేయింగ్‌లో ఇంటర్మీడియట్ లేదా చివరి పరీక్షలో ఉత్తీర్ణత సాధించినవారు, లేదా తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే నాలుగు నెలల కాలానికిల్యాండ్ సర్వేయింగ్‌లో సర్టిఫికేట్ కోర్సులో ఉత్తీర్ణత, లేదా కన్ స్ట్రక్షన్ టెక్నాలజీ లేదా వాటర్ సప్లై అండ్ శానిటరీ ఇంజనీరింగ్ టెక్నీషియన్‌లో ఇంటర్మీడియట్ వొకేషనల్ కోర్సులో ఉత్తీర్ణత, లేదా ల్యాండ్ సర్వేయర్ సబ్జెక్టులో మూడు నెలల పాటు అభ్యర్థులకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ సర్టిఫైడ్ కలిగి ఉన్న వారు లైసెన్స్ సర్వేయర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అభ్యర్థులు శారీరక దృఢత్వం కలిగి ఉండి, సివిల్ సర్జన్‌నుండి సర్టిఫికేట్‌ను సమర్పించాల్సి ఉంటుందన్నారు. లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం ఓ.సీ అభ్యర్థులు రూ. 10,000/, బీ.సీలు రూ. 5,000/, ఎస్సీ/ఎస్టీలు రూ. 2,500/ రుసుము చెల్లించాలన్నారు. శిక్షణ నిమిత్తం నమోదు కోసం మీ సేవా కేంద్రం నుండి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారం కాపీ, టెన్త్, ఇంటర్మీడియట్ కాపీలు, ఐటిఐ (సివిల్), డిప్లొమా (సివిల్), బీ.టెక్ (సివిల్) వంటి మార్కుల మెమోతో పాటు నిర్దేశించిన విధంగా సాంకేతిక అర్హత సర్టిఫికేట్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. చిరునామా రుజువుగా ఆధార్ కార్డు కాపీ, బి.సి, ఎస్.సి, ఎస్టీ అభ్యర్థులు తహశీల్దార్ జారీ చేసిన కులధృవీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు. లైసెన్సు సర్వేయర్ కోసం ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ లోపు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# విద్యార్థులను అభినందించిన వనపర్తి జిల్లా కలెక్టర్



విద్యార్థులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**పెబ్బేరు, మే 8 ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాల పెబ్బేరు విద్యార్థి జయ రాములు హెచ్‌ఈసి సెకండియర్ గ్రూపులో ఏప్రిల్ 22 తారీఖున బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ విడుదల చేసిన ఫలితాలలో అత్యుత్తమ మార్కులు 823 సాధించి వనపర్తి జిల్లా స్థాయిలో హెచ్ ఈసి గ్రూపులో రెండవ ర్యాంకర్‌గా నిలిచి అందరి మనలను పొందడం జరిగింది. వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, ప్రభుత్వ పాఠశాలలో, ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతిలో మరియు ఇంటర్మీడియట్‌లో జిల్లా స్థాయిలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులందరికి కలెక్టర్ సామూహిక భవనం ఐడిసి భవనంలో విద్యార్థులందరినీ ఘనంగా మెమెంటుతో, ఏపీజే అబ్దుల్ కలాం ఇగ్నైటెడ్ మైండ్స్ అనే పుస్తకం విద్యార్థులకు ఇచ్చి అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా అందుకు కారణమైన అధ్యాపకులను కూడా అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం పుస్తకం అందరు చదవాలని సూచించారు. మార్కులతోపాటు విద్యార్థులు అన్ని రంగాలలో సామాజిక స్పృహ అవగాహనతో, మీ భవిష్యత్ నిర్మాణం కోసం శాస్త్రీయమైన విజ్ఞానంతోచదవాలని, మంచి క్రమశిక్షణను అవలంబించుకోవాలని, మీ విజ్ఞానం, చదువు మీ జీవితాలకే కాకుండా దేశ అభివృద్ధికి ఉపయోగపడాలని తెలియజేశారు. ఇంటర్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు సపరేటు యాక్షన్ ప్లాన్ ఏర్పాటుచేసి రోజు క్లాసులు నిర్వహిస్తున్నామని, క్లాస్‌లోకి రావడానికి వీలుకాని విద్యార్థులకు ఆన్లైన్లో అధ్యాపకులు క్లాసులు తీసుకుంటున్నారని డిఐఈఓ తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు కళాశాల సిబ్బంది హెచ్‌ఇసి గ్రూప్ విద్యార్థి జయరాములను అభినందించడం జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల రెండవ సంవత్సరం విద్యార్థులు వైష్ణవి, 904 బైపీసీలో, సీఈసి గ్రూపులో టి అంజలి 851, ఈ చామంతి 832, హెచ్‌ఈసి గ్రూప్‌లో జయ రాములు 823 మార్కులు సాధించి, పెబ్బేరు మండలానికి, కళాశాలకు తల్లిదండ్రులకు అందరికీ ఆదర్శంగా నిలిచారని పెబ్బేరు కళాశాల పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు కృష్ణయ్య ఈ సందర్భంగా తెలియజేశారు. ఈనెల 22వ తారీఖున ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని ఫెయిల్ అయిన విద్యార్థులకు, స్పెషల్ క్లాసులు యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని క్లాసులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

# 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

■ అంగన్వాడీలను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలి ■ సిఐటియు జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు



మెమోరండం అందజేస్తున్న కార్మిక నాయకులు

**వీపనగండ్ల మే 8 ప్రభాతవార్త :** తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మార్వో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ కు ఈనెల 20న జరిగే సమ్మె నోటీసును అందజేయడం జరిగిందిఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు మాట్లాడుతూ, శతాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు. పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుంది. కోడ్సు అమలు జరుగుతే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరం అవుతుంది. కార్మికుల సమిష్టి బేరసారాల శక్తి నిర్వీర్యం చేయబడుతుంది. ఉద్యోగ భద్రత. ఉపాధి కోల్పోతారు. కార్మిక శాఖ కూడా నిర్వీర్యం చేయబడుతుంది అని కార్మిక సంఘాలు భావించాయి. వీటితో పాటు ఐసిడిఎస్‌ను నిర్వీర్యంచేస్తూ ఐసిడిఎస్ ప్రైవేటీకరణ విధానాలు ఈ కాలంలో అనేకం తెచ్చింది. అంగన్వాడీ టీచర్స్. హెల్పర్స్. మినీ టీచర్స్ సమస్యలు ఏ ఒక్కటి పరిష్కారం చేయకుండా కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీలను మోసం చేస్తున్నది. దేశంలోని పరిస్థితి నంతటిని సమీక్ష చేసిన కేంద్ర కార్మిక సంఘాలు. స్వతంత్ర ఫెడరేషన్లు. అసోసియేషన్లు 2025 మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయి ఆ పిలుపును తెలంగాణ రాష్ట్రంలోనూ అమలు చేసి సమ్మెలో పాల్గొనాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయి. మే 24 జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం కూడా పాల్గొంటుందని. పారిశ్రామిక వివాదాల చట్టం 1947 లోని సెక్షన్ 22 సబ్ సెక్షన్ ఒకటిని అనుసరించి సమ్మె నోటీసులను వీపనగండ్ల ఎమ్మార్వో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గారికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉద్యోగ యూనియన్ నాయకులు సుగుణబాయి. కమల. ఎల్లమ్మ. లక్ష్మి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు ఆర్యన్ రమేష్ సూర్యవంశం రాము ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి దరఖాస్తుల స్వీకరణ

**మహబూబ్‌నగర్, మే8 ప్రభాతవార్త:** భూభారతి నూతన రెవెన్యూ చట్టం (గ్రామ రెవెన్యూ సదస్సు) మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట్ మండలం పైలెట్ ప్రాజెక్టు మండలంలో గురువారం కొమిరెడ్డి పల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో, నంది పేట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక భూ సమస్యలు ఉన్న రైతుల నుండి దరఖాస్తు స్వీకరించి తగిన సూచనలు, సలహాలు అంద చేశారు. జిల్లా కలెక్టర్ తో పాటు తహశీల్దార్ రాజు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## 17 వరకు దరఖాస్తుల స్వీకరణ

**మహబూబ్‌నగర్, మే 8 ప్రభాతవార్త:** భూ భారతి చట్టం 2025 అమలులో భాగంగా రెవెన్యూ యంత్రాంగం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖకు సహాయకారిగా ఉండేందుకు ఆసక్తి గల లైసెన్స్డ్ సర్వేయర్‌లు మీసేవ ద్వారా మే17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ విజయేందిర బోయి ఒక ప్రకటనలో తెలిపారు. పౌరుల భూ సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి (భూమి హక్కుల రికార్డు) చట్టం 2025ను అమలులోకి తీసుకువచ్చినట్లు ఆమెతెలిపారు. రెవెన్యూ యంత్రాంగం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్‌కు సహాయపడేందుకు రాష్ట్రంలో దాదాపు 5000 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్‌లకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్‌లకు శిక్షణ ఇచ్చి జిల్లాల్లో నియమించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్‌లకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ద్వారా మే 26 నుండి జులై 26వరకుశిక్షణ (50రోజులుపని దినాలు) ఇవ్వనున్నట్లు తెలిపారు

## ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి

**ఇటిక్యాల, మే 8 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన నారాయణ 30 సంవత్సరాలు అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. వారి కథనం మేరకు బుధవారం ఎర్రవల్లిలో గ్రామ దేవర ఉన్నందున ఎర్రవల్లికి రాగా అయితే గత కొంతకాలంగా మద్యానికి అలవాటు పడి ఎలాంటి పని చేయకుండా తిరిగేవాడని ఎర్రవల్లిలో మద్యం సేవించడంతో ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు మృతునికి భార్య ఒక కుమారుడు ఉన్నాడని మృతుని అన్న రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## కేజీబీవీకి బైపిసి, ఎమ్మెల్టి కోర్సులు మంజూరు

**చిన్నంబావి, మే 8 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలకు రెండుఇంటర్మీడియట్ కోర్సులు మంజూరైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ సుజాత తెలిపారు. గురువారం ఒక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ మండలంలో పదవ తరగతి ఫలితాలు మండల టాపర్‌గా కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థి నిలిచిందని, అలాగే పాఠశాలలో ఉన్న 10వ తరగతి అందరు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని 100 రిజల్ట్ రావడం కోసం కృషి చేసిన తమ ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభినందించారు. వచ్చే వార్షిక 2025, 2026 సంవత్సరంలో ఇంటర్మీడియట్ బైపిసి, ఎంపిసి కోర్సులను తమ పాఠశాలలో ప్రారంభిస్తున్నామని ఒక్కొక్క కోర్సులో 40 మంది విద్యార్థులకు అవకాశం ఉందని, మొత్తం 80 సీట్లు ఉన్నాయని అన్నారు. అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆమె తెలిపారు. సీట్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యతగా తల్లిదండ్రులు లేని విద్యార్థులకు అవకాశం ఉంటుందని, ఆ తర్వాత తమ సంస్థ అయిన వివిధ కేజీబీవీ పాఠశాలలో ఉత్తీర్ణత పొందిన వారికి అవకాశం ఉంటుందని, ఆ తర్వాత అత్యధిక మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని ఆమె అన్నారు.

## శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలి

**చిన్నంబావి, మే8 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్నమారూర్ గ్రామంలో ఈ నెల 13,14 మంగళ, బుధవారాలలో నిర్వహించే సుంకులమ్మ జాతరపై మండల ఎస్సై జగన్మోహన్ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో నిర్వహించే ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని, జంతుబలులు, హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా కుల మతాలకతీతంగా సోదర భావంతో వేడుకలు నిర్వహించాలని గ్రామ ప్రజలకు సూచించారు. చట్ట పరిధిలోని అంశాలను గౌరవించాలని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలుతప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జగన్మోహన్‌తో పాటు వారి సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## లైసెన్స్ సర్వేయర్లు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**గద్వాల, మే 8, ప్రభాతవార్త:** లైసెన్సు సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మీసేవ కేంద్రాల ద్వారా లైసెన్స్ సర్వే శిక్షణ కార్యక్రమానికి ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ (గణితశాస్త్రం) ఒక అంశంగాఉండి కనీసం అరవై శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఐటిఐ నుండి డ్రాఫ్ట్ మన్ (సివిల్), డిప్లమా సివిల్, బీటెక్ సివిల్ లేదా ఇతర సమానమైన విద్యా అర్హతకలిగి ఉండాలి. శిక్షణ ఫీజుఓసి అభ్యర్థులకు రూ. 10,000/లు, బీసీ అభ్యర్థులకు రూ. 5,000/ లు, ఎస్సీ /ఎస్టీ అభ్యర్థులకు రూ. 2,500/ చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రంలో మొత్తం 50 పని దినాలలో తెలంగాణ అకాడమీ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్‌ఆధ్వర్యంలో శిక్షణఇవ్వబడుతుందని తెలిపారు. అభ్యర్థులు మీసేవ కేంద్రాలద్వారా మాత్రమేదరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849081489: 732634404: 9441947339 లకు సంప్రదించాలని సూచించారు.

## లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

**శ్రీరంగాపూర్, మే 8 ప్రభాతవార్త :** వీపనగండ్ల గ్రామానికి చెందిన దాసర్ల తిరుపతయ్య కంచిరావుపల్లి నుంచి తన సొంత గ్రామమైన వీపనగండ్లకు అతని టీవీఎస్ ఎక్సెల్ వాహనం మీద వెళుతూ ఉండగా నిన్న రాత్రి దాదాపు 7గం.ల సమయంలో కంబాలపురం గ్రామం దాటిన తర్వాత శ్రీరంగాపురం గ్రామ శివారులో జాలు కాలువ దగ్గర అతనికి ఎదురుగా ఒక లారీ అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి అతన్ని ఢీకొట్టగా అతనికి కాళ్లకు చేతులకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం అదే రోజు వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతూ నిన్న రాత్రి చనిపోయినాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఏఎస్ఐ తెలియజేయడం జరిగింది. వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పంచనామా నిర్వహించడం జరిగిందని తెలిపారు.

## ఐదుగురుపై న్యూసెన్స్ కేసు

**చిన్నంబావి, మే 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వెల్టూరు గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు ఘర్షణ పడి గొడవలు సృష్టించుకోవడంతో వారితో పాటు మరో ముగ్గురిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు. షాలుమియా బడసహాబ్ ఇద్దరు గొడవ పడుతూ న్యూసెన్స్ చేయడంతో వారి మీద కేసు చేయడం జరిగిందన్నారు. వారిని వనపర్తి కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.500 ఫైన్ వేయడం జరిగింది. ఈ కేసులో మొత్తం 5 మంది మీద కేసు నమోదు చేయడం జరిగింది. అందరికీ కలిపి 2500 కోర్టుకు ఫైన్ చెల్లించడం జరిగిందని ఎస్సై జగన్మోహన్ తెలిపారు.

# అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పండిత్ రావు, యూత్ కాంగ్రెస్ అచ్చంపేట నియోజకవర్గ అధ్యక్షులు క్యామ మల్లయ్య, రంగాపూర్ సింగిల్ విండో చైర్మన్ కుడుముల సురేందర్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రసిడెంట్ రమేష్ గౌడ్, అల్వాల్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీటిపారుదల రంగంపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి అందజేశామని ఇందుకు సంబంధించిన నివేదికలను పూర్తిస్థాయిలో తయారు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గ పరిధిలోని పలు చెరువులుకుంటలు చెక్‌డ్యాముల నిర్మాణాలు మరమ్మత్తులను వెంటనే చెప్పటాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సిఇ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, డిసిఇ వెంకట్‌రెడ్డి, డిఇలుకేశవరావు, జగన్మోహన్ రెడ్డి, డిఇలు నరేందర్ రెడ్డి, అబ్దుల్ గఫార్, వెంకటరమణదేవి, రాజ్ కుమార్, కిరణ్ కుమార్ ఎల్లస్వామి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమై, పనుల పర్యవేక్షణ, సమాచారం నమోదు, రైతులకు అందాల్సిన సేవలపై స్పష్టమైన సూచనలు ఇచ్చారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు

**◆ మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి వెల్లడి**



**మహబూబ్‌నగర్ బ్యూరో మే 8 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ డి.జానకి నేతృత్వంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి పలు ముందస్తు భద్రత చర్యలు చేపట్టారు. దేశ సరి హద్దుల్లో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా మహబూబ్‌నగర్ జిల్లాలో ముందస్తు భద్రత చర్యలు చేపట్టబడ్డాయి. జిల్లా వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తంగా విధుల్లో ఉంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసుల సెలవులు రద్దు చేసి 24 గంటల పాటు విధుల్లో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఎవ్వరు కూడా అనుచిత పోస్టులు, తప్పుడు సమాచారం ప్రసారం చేయొద్దనీ, దేశ భద్రత, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏవైనా వ్యాఖ్యలు చేయరాదు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు చేయడం నిషిద్ధమని సోషల్ మీడియాలో పటిష్ట నిఘా కొనసాగుతుంది. చట్టానికి లోబడి వ్యవహరించాలి. అనుమానాస్పద వ్యక్తుల గురించి పోలీసులకు సమాచారం అందించాలి. గుర్తింపు లేకుండా ఉన్నవారికిలాడ్జిలలో వసతి కల్పించవద్దు. డ్రగ్స్, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడంలో సహకరించాలని ఎస్పీ కోరారు.

# చికిత్స పొందుతూ ఏఆర్ కానిస్టేబుల్ మృతి

**వారం రోజుల్లో పెళ్లి.. అంతలోనే ఘోరం**



మృతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రీరామ్ నాయుడు (ఫైల్)

**మానవపాడు, మే8 ప్రభాతవార్త:** వారం రోజుల్లో పెళ్లి కావలసిన వరుడు బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. దీంతో ఆ ఇంట్లో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం కిష్టాపురం శివారులో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం తనగల గ్రామానికి చెందిన బోయ బుచ్చన్న కుమారుడు శ్రీరామ్ నాయుడు గత ఏడాది ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొంది హైదరాబాదులో విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 14న తనవివాహ కార్యక్రమం ఉండడంతో బుధవారం ఉదయం హైదరాబాద్ నుండి సొంత గ్రామమైన తనగలకు తన బైక్ పై వస్తుండగా అదే గ్రామానికి చెందినమరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం హుటాహుటిన కర్నూల్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 14న వివాహం కావలసిన శ్రీరామ్ నాయుడు మృతితో ఆ ఇంట్లో విషాదఛాయలు అమ్ముకున్నాయి. అయితే శ్రీరామ్ నాయుడును ఢీకొన్న మరో బైక్‌పై ఉన్న వారిలో త్రివేణు మృతి చెందగా మరో ఇద్దరు శివ, రవి తీవ్రంగా గాయపడ్డారు.

# సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల, మే 8 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గురువారం గద్వాల టౌన్ వివిధ వార్డ్ లకు సంబంధించిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. బేబీ ఆఫ్ సులేఖ తండ్రి బాలాజీ కు (చికిత్స) నిమిత్తం 60000 రూపాయల చెక్కును, వెంకట్రాములు తండ్రి రాజేష్ కుమార్ కు (చికిత్స) నిమిత్తం 60000 రూపాయల చెక్కును, ఫణి కుమార్ తండ్రి శ్రీనివాస్ ఆచార్య కు (చికిత్స) నిమిత్తం 60000 రూపాయల చెక్కును. మహమ్మద్ రఫీ తండ్రి మాస్ కు (చికిత్స) నిమిత్తం 60000 రూపాయల చెక్కును, బేబీ ఆఫ్ శిరీష్ తండ్రి అబ్దుల్ జలీల్ కు (చికిత్స) నిమిత్తం 60000 రూపాయల చెక్కును. గుండ్రటి స్ఫూర్తి తండ్రి అనిల్ కుమార్ కు (చికిత్స) నిమిత్తం 58000 రూపాయల చెక్కును. అబ్దుల్ రషీద్ తండ్రి అజీమ్ కు (చికిత్స) నిమిత్తం 56000 రూపాయల చెక్కును. టీ . భీమేశ్వర తండ్రి టి . తిమ్మప్ప కు (చికిత్స) నిమిత్తం 51000 రూపాయల చెక్కును. టీ . వేంకటన్న తండ్రి టి . నర్సన్న కు (చికిత్స) నిమిత్తం 51000 రూపాయల చెక్కును. బి .అశ్విని తండ్రి వాసుదేవ్ కు (చికిత్స) నిమిత్తం 48000 రూపాయల చెక్కును. బోయ మహేష్‌తండ్రి బోయ శంకరన్న కు (చికిత్స) నిమిత్తం 44000 రూపాయల చెక్కును. ఊర్మిళ తండ్రి టి . నరేష్ కు (చికిత్స) నిమిత్తం 44000 రూపాయల చెక్కును. ప్రవీణ్ తండ్రి మాలిక నవీద్ కు (చికిత్స) నిమిత్తం 40000 రూపాయల చెక్కును. మండ్ల రమాదేవి తండ్రి మండ్ల సాయి బాబా (చికిత్స) నిమిత్తం 34000 రూపాయల చెక్కును.సి. జగన్నాథ రెడ్డి తండ్రి సి. లక్ష్మీ రెడ్డి (చికిత్స) నిమిత్తం 200 00 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ చైర్మన్ బోయ వెంకటరాములు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ , జిల్లా సీనియర్ నేత రమేష్ నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, మాజీ కౌన్సిలర్స్ మురళి ,నరహరి శ్రీనివాసులు, సాయి శ్యామ్‌రెడ్డి, పూడూరు కృష్ణ, నరహరి గౌడ్, రిజ్వాన్, సుధాకర్, ఆలయ కమిటీ డైరెక్టర్ వెంకటేష్, నాయకులు గోవిందు, ధర్మ నాయుడు కురుమన్న, రామాంజనేయులు, నాగేంద్ర యాదవ్, శంకర్ ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్, షాషా , నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బోధనేతర నూతన కార్యవర్గం ఏర్పాటు చేయండి

**వీసికి వినతిపత్రం అందజేసిన పీయూ బోధనేతర ఉద్యోగులు**

**మహబూబ్‌నగర్ మే 8 ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీలోని బోధనేతర ఉద్యోగులు నూతన కార్యవర్గం ఏర్పాటు చేయాలని వీసీ ఆచార్య జీఎన్ శ్రీనివాస్‌ను కోరారు. గురువారం యూనివర్సిటీ పరిధిలో బోధనేతర ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, అదేవిధంగా 2008 నుంచి 12ఉన్న వేతన పెంపు కొనసాగించడంగురించి, ప్రస్తుతం ఉన్న కార్యవర్గంలో అంతర్గత కుమ్ములాటల వలన బోధనేతర ఉద్యోగులు తీవ్రంగానష్టపోతున్నారని, ప్రస్తుతం ఉన్న బోధనేతర కార్యవర్గం రద్దు చేయాలని, నూతన కార్యవర్గం ఎన్నికకు అనుమతించాలని వీసీని కోరారు.



వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగులు

# ప్రజా ఫిర్యాదులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**- అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇంఛార్జ్ యాదయ్య**



పంచాయతీ సెక్రటరీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇంఛార్జ్

**వనపర్తి టౌన్, మే 8 ప్రభాతవార్త:** పంచాయతీ సెక్రెటరీలు ప్రభుత్వ పాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసి హాల్లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోనిప్రతి మండలం నుండి ఇద్దరు చొప్పున పంచాయతీ సెక్రటరీలకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఏ గ్రామమైన అభివృద్ధి సాధించడానికి పంచాయతీ సెక్రెటరీలది పంచాయతీ సెక్రెటరీలది కీలక పాత్ర ఉంటుందని గుర్తు చేశారు. గ్రామాలలో ఎన్నికైన సర్పంచులు కొందరు విద్యావంతులు మరికొందరు అక్షరాస్యత లేని వారు సైతం ఉంటారని, గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో పంచాయతీ సెక్రెటరీకిల పాత్ర చాలా కీలకంగా ఉంటుందన్నారు. గ్రామ సభలు ఏ విధంగా నిర్వహించాలి, గ్రామ సభలో చర్చించాల్సిన అంశాలు ఏముంటాయి ప్రభుత్వ పాలనలో వచ్చే కొత్త కొత్త సంస్కరణలను గ్రామాల్లో అమలు చేయాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా సమాచార హక్కు చట్టం పై అవగాహన కలిగి ఉంటే ప్రజా ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించవచ్చు అన్నారు. అందుకే రెండు రోజుల పాటు నిర్వహించే నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్‌లు రిటైర్డు డిపిఒ కృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ డా. హనుమంతు, పంచాయతీ సెక్రెటరీలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ అధికారుల నియామకానికి చర్యలు

**◆ అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం లిఖిత పూర్వకంగా సమాధానం ◆ వెల్లడించిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి**

**జడ్చర్ల, మే8 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీలలో ప్రస్తుతం కొత్తగా 453 ఇంజనీరింగ్ అధికారుల నియామకానికి చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు తాను అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రం ఏర్పడక ముందు అంటే ఉమ్మడి రాష్ట్రంలో 62 మున్సిపాలిటీలో ఉంటే గత పదేళ్ల కాలంలో వాటి సంఖ్య 152కు పెరిగిందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీలనైతే ఏర్పాటు చేసింది గానీ వాటిలో పని చేయడానికి అవసరమైన కమీషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారుల పోస్టులను మాత్రం మంజూరు చేయలేదని గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో అనిరుధ్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం కూడా ఏర్పాటు చేసిన 42 కొత్త మున్సిపాలిటీలు కమీషనర్లు, ఏఇఇలు, టీపీఓలు లేకుండానే పని చేసాయని చెప్పారు. అయితే అడ్మినిస్ట్రేషన్ చూసుకోవడానికి కమీషనర్లు, మున్సిపాలిటీలకు మంజూరయ్యే అభివృద్ధి పనులను పర్యవేక్షించడానికి ఇంజనీరింగ్ అధికారులు, పట్టణాల ప్రగతికి అవసరమైన అనుమతులు ఇచ్చే టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోతే మున్సిపాలిటీలు ఎలా అభివృద్ధి చెందుతాయని ఆయన ప్రశ్నించారు. ఈ కారణంగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం కూడా ఈ కొత్త మున్సిపాలిటీలలో ఇంచార్జీల పాలనతో ఏ మున్సిపాలిటీ కూడా అభివృద్ధి చెందని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది అక్టోబర్ నెలలో ఈ మున్సిపాలిటీలకు అవసరమైన కమీషనర్ పోస్టులను మంజూరు చేసి వాటికి సంబంధించిన నియామకపు ప్రక్రియ చేపట్టిందని, కమీషనర్లతో పాటుగా టౌన్ ప్లానింగ్ అధికారుల అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం 165 మంది టౌన్ ప్లానింగ్అధికారులను నియమించడం జరిగిందని వివరించారు. 2009లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో అప్పుడున్న 62మున్సిపాలిటీల సంఖ్యకు అనుగుణంగా మంజూరు చేసిన ఇంజనీరింగ్ పోస్టులతోనే ఇప్పటి వరకూ నెట్టుకొస్తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగిన పదేళ్ల కాలంలో ఇంజనీరింగ్ పోస్టులను మంజూరు చేయలేదని చెప్పారు. ఉదాహరణకు చెప్పాలంటే లక్ష మంది జనాభా కలిగిన జడ్చర్ల మున్సిపాలిటీలో పాత నిబంధనల ప్రకారంగా అయితే ఒక డిఇ, ఇద్దరు ఏఇఇలు ఉండాలని, కొత్త రూల్స్ ప్రకారంగా అయితే ఒక ఇఇ కూడా ఉండాలని, కానీ ఈరోజు వరకూ కూడా జడ్చర్ల మున్సిపాలిటీలో ఒక్క రెగ్యులర్ ఏఇఇ కూడా లేరని తెలిపారు. ఏఇఇలు, డిఇ లు లేకుండా అభివృద్ధి పనులు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. ప్రస్తుతం ఒక్కో ఏఇఇ 6 మున్సిపాలిటీలకు ఇంచార్జీలుగా పని చేస్తున్నారని, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మొత్తం 21 మున్సిపాలిటీలు ఉంటే ఆ 21 మున్సిపాలిటీలకు కలిపి ఇద్దరు డిఇ లే ఉన్నారని, అలాగే 21 మున్సిపాలిటీలకు కలిపి కేవలం ఒకే ఒక్క ఇఇ ఉన్నారని వెల్లడించారు. ఒక ఇఇ 21 మున్సిపాలిటీల్లో జరిగే పనులను పర్యవేక్షించడం సాధ్యమౌతుందా? అని వాపోయారు. అలాగే ఇక రాష్ట్రం విషయానికొస్తే 5 ఉమ్మడి జిల్లాలకు కలిపి ఒక ఎస్ఇ ఉన్నారని, ప్రస్తుతం సౌత్‌కు ఒకరు, నార్త్‌కు ఒకరు చొప్పున రాష్ట్రంలో కేవలం 2ఎస్ఇలు మాత్రమే పబ్లిక్ హెల్త్‌లో పని చేస్తున్నారని వివరించారు. ఇక ఎస్ఇ తర్వాత సిఇ పోస్టులు మంజూరు కాలేదని, ఒకఇ.ఎన్.సీ. మాత్రం ఇంచార్జ్‌గా పని చేస్తున్నారని అనిరుధ్‌రెడ్డి వివరించారు. ఈ నేపథ్యంలోనే తాను అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం లిఖిత పూర్వక సమాధానం ఇస్తూ, కొత్తగా ఏర్పాటు చేసిన పురపాలికల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంజనీరింగ్ పోస్టులను మంజూరు చేయని మాట వాస్తవమేనని చెప్పిందన్నారు. అలాగే ఏఇఇ, డిఇఇ, ఇఇ, ఎస్ఇ స్థాయిల్లో 453 ఇంజనీరింగ్ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ కొనసాగుతోందనివెల్లడించిందని అనిరుధ్ రెడ్డి వివరించారు.

# కొనసాగుతున్న రైతుల రాస్తారోకోలు, నిరసనలు



నిరసన తెలుపుతున్న రైతులు

**కృష్ణ, మే 8 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గంలోని, కృష్ణ మండలం గుడేబల్లూరు గ్రామ శివారులో కల పారాజాన్య రైస్ మిల్లులో కొనుగోలు ప్రక్రియ నత్త నడకలా సాగుతుంది. మండలంలోని వరి ధాన్య రైతులు రైస్ మిల్లు దగ్గరే తిండి నిద్రలు విడిచి ఎండలో గత పది రోజులుగా పడిగాపులు కాస్తున్నామని, మిల్లు యాజమాన్యం, అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. జాతీయ రహదారి (167)పై ఎన్నిసార్లు రాస్తారోకో, నిరసనలు చేపట్టినా ఫలితం లేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం వద్ల కొనుగోలు విషయంలో ఇంత నిర్లక్ష్యం వ్యవహరించలేదని, సమయానికి వడ్లు కొనుగోలు చేశారన్నారు. ఇది ప్రభుత్వ లోపమా.. అధికారుల నిర్లక్ష్యమా అర్థం కావడం లేదని అక్కడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజుకు ట్రాక్టర్ కిరాయికి 4 వేల చొప్పున చెల్లిస్తున్నామని, ఇంతలా నష్టపోతున్న అధికారులు పట్టించుకోవడంలేదని వరి ధాన్యపు రైతులు వాపోతున్నారు.

# చరిత్రకు ఆనవాళ్లుగా ఉండే కట్టడాలను కాపాడుకుందాం

**◆ పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధీకరణకు ,రాజప్రసాదం పునరుద్ధరణపై ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ**

**◆ బంగ్లాను పరిశీలించిన ముంబై ఆర్కిటెక్చర్ సరయు మోరే**



పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్కిటెక్ బృందం

**వనపర్తి క్రైమ్, మే8 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే సూచన మేరకు రాజ ప్రసాదాన్ని సందర్శించి పరిశీలించిన ఆర్కిటెక్ సరయు మోరే వనపర్తి జిల్లా ప్రాశస్త్యాన్ని చాటిచెప్పే రాజప్రసాదా (రాజా గారి బంగ్లా పాలిటెక్నిక్ కళాశాల) పునరుద్ధరణకు వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు గురువారం ముంబైకి చెందిన ఆర్కిటెక్ సరయు మోరే వనపర్తి రాజప్రసాదాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణానికి వచ్చిన ఆర్కిటెక్‌ను వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య పుష్పగుచ్ఛం శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం వారు రాజప్రసాదాన్ని సందర్శించి పరిశీలించారు. చరిత్రకు ఆనవాళ్లుగా ఉండే ఇలాంటి కట్టడాలను కాపాడుకోవడం ఎంతో అవసరం అని ఈ రాజప్రసాద పునరుద్ధరణకు కావలసిన పూర్తిస్థాయి నమూనాను త్వరలోనే తయారుచేసి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డికి సమర్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బొంబాయి మన్యంకొండ, చుక్క రాజు, వసీం, ఫాషా, రఘు యాదవ్, యువకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాలూరు దేవాలయానికి ఆర్చి నిర్మాణం



నిర్మాణంలో ఉన్న ఆర్చి

**చిన్నంబావి, మే8 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కాలూరు గ్రామంలో శివాలయానికి నాలుగు లక్షల విలువ గల ఆర్చి నిర్మాణానికి గ్రామానికి చెందిన బహుజన బిడ్డ నాయి బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సాయిబాబు ముందుకు వచ్చి ఆర్చి నిర్మాణానికి దాతగా నిలిచాడు. చిన్నతనం నుండి సామాజిక సేవ, పౌరాణిక నాటకాలు, వివిధ జానపద పాటల రచన, గాయకుడిగా, రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పలు కార్యక్రమంలో విరివిగా పాల్గొన్న కాలూరూ సాయిబాబు చిన్నతనం నుండి గ్రామానికి దూరంగా ఉంటూ పలు వ్యాపారాలు చేసి ఆర్థికంగా ఎదగడంతో పుట్టిన గడ్డకు తన రుణం తీర్చుకోవాలని ఉద్దేశంతో గ్రామా శివాలయంకు ఆర్చి నిర్మాణంచేపట్టాడు. దీంతో గ్రామ ప్రజలు అతన్ని అభినందిస్తున్నారు. గ్రామ మాజీ సర్పంచ్ యశోద తిరుపాల్ నాయుడు మాట్లాడుతూ ఆర్చి నిర్మాణానికి దాతగా నిలిచిన సాయిబాబాను అభినందించడం జరిగింది. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టి గ్రామ ప్రజలకు సేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాలూరు సాయిబాబు మాట్లాడుతూ గ్రామంలో నివసిస్తున్న నిరుపేదలకు తన వంతు ఆర్థిక, నిత్యవసర వస్తువుల సహాయ, సహకారానీ అందిస్తున్నానని, దేవుడు తన గ్రామ ప్రజలను చల్లగా చూడాలని ఆయన గ్రామ దేవుడైన శివుని వేడుకున్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ యశోద తిరుపాల్ నాయుడు, గ్రామస్తులు రామకృష్ణ నాయుడు, యాదగిరి, పానుగంటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు దుస్తులు, పండ్ల పంపిణీ



**జడ్చర్ల, మే 8 ప్రభాతవార్త:** మాజీ మంత్రి డా.సి. లక్ష్మారెడ్డి కుమారుడు స్వరణ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం సాయంత్రం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు దుస్తులు, పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, పురపాలక మాజీచైర్పర్సన్ దోరేపల్లిలక్ష్మి, కౌన్సిలర్లు నందకిషోర్ గౌడ్, కోట్ల ప్రశాంత్ రెడ్డి, దేవా, ఆలూరు శశికిరణ్, సతీష్, ఉమా శంకర్ గౌడ్, బుక్కా మహేష్, నాయకులు కోనేటి నరసింహులు, రామ్మోహన్, వెంకటేష్, కొండల్, బి.కృష్ణారెడ్డి మహమూద్, మతీన్, ఆశ్రమ నిర్వాహకులు సంజీవ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్ష బరిలో క్యామ మల్లయ్య

**వంగూరు, మే 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో పార్టీని నమ్ముకుని పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు బడా నాయకులు కాంగ్రెస్ పార్టీలో తమ కార్యకర్తలకు భరోసా కల్పిస్తున్నారు. జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గెలుపునకు కృషి చేస్తూ వంగూరు మండలంలోనే కాకుండా అచ్చంపేట నియోజకవర్గంలో తనకున్న పరిచయాలతో పాటు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి ఎమ్మెల్యే గెలుపుకు కొంత వరకు కృషి చేసిన వారిలో ఒకరు వంగూరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన క్యామ మల్లయ్య. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షబరిలో క్యామ మల్లయ్య ఉన్నట్లు తెలుస్తోంది. గత శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గెలుపు కోసం అహర్నిశలు క్యామ మల్లయ్య కృషి చేశారు. అదే కాకుండా పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ యువతను సమన్వయం చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా ఎమ్మెల్యేకు అండగా ఉంటూ వస్తున్నారు. ప్రస్తుతం మల్లయ్య అచ్చంపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధినేత బీసీ వర్గాలకు చెందినయువతకు రాజకీయాలలోఅధిక ప్రాధాన్యత కల్పిస్తా మన దం గతంలో ప్రకటించారు. ఈ నేపథ్యంలో క్యామ మల్లయ్య బీసీ కోటాలో మండలపార్టీ అధ్యక్షబాధ్యతలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. నిరంతరం పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న క్యామ మల్లయ్యకు మండలబాధ్యతలుఅప్పగిస్తేపార్టీ మరింతబలోపేతమ వుతుందని పలువురు నాయకులు అభిప్రాయపడుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం. మండలంలో పార్టీని సమన్వయం చేసే నాయకుడు లేకపో వడంతో ఎవరికి వారు యమునా తీరు అన్నట్లుగా వ్యవహరిస్తూ ఒక్కో గ్రామంలో 2 లేదా 3 గ్రూపులుగా ఏర్పడి పార్టీని చిన్న భిన్నం చేస్తున్న పరిస్థితి నెలకొంటుందని చెప్పుకోవచ్చు. యువతకు అవకాశాలు ఇస్తే అన్ని వర్గాల ప్రజలను మమేకం చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే అవకాశం లేకపోలేదని బాహటంగా చర్చలు కొనసాగుతున్నాయి.

# నిబంధనల ప్రకారమే వడ్లు కొనుగోలు చేయాలి

**◆జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు**



వడ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**వనపర్తి రూరల్, మే8 ప్రభాతవార్త:** తాలు, గడ్డి, మట్టి లేకుండా నిబంధనల ప్రకారమే వడ్లు కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం వనపర్తి మండలం లోని రాజాపేట వరి కొనుగోలు కేంద్రం, ఆమడబాకులలో లక్ష్మీ నరసింహ రైస్ మిల్, పెబ్బేరు మండలంలో సప్తగిరి రైస్ మిల్, లక్ష్మివారాహి రైస్ మిల్, కంబలాపూర్ రైస్ మిల్లుల్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. మిల్లుకు దొడ్డ వడ్లు వస్తె దింపుకోమని, ప్రక్కన పెట్టడానికి వీలులేదని ఖచ్చితంగా ప్రతి మిల్లు 5వేల బస్తాలదొడ్డు బియ్యం దించుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా వచ్చిన లారీలను త్వరగా అన్‌లోడ్ చేసే విధంగా హమాలీల సంఖ్యను పెంచాలని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక లారీ పెట్టాలని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లను ఆదేశించారు.

# ధాన్యం అమ్మకంలో సమస్యలు ఉంటే తెలియజేయండి

**◆మంత్రి జూపల్లి క్యాంప్ ఆఫీస్ అధికారులు**

**కొల్లాపూర్, మే 8 ప్రభాతవార్త :** కొల్లాపూర్ నియోజకవర్గంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలులో ఐకెపి ద్వారా మహిళా సంఘాల వారు సింగిల్ విండో సొసైటీల ద్వారా కొనుగోలు జరుగుతున్నదనీ, ఆయా కేంద్రాలలో వరి ధాన్యం కాంట అయిన తర్వాత లోడ్ అయిన లారీలు ఏ మిల్లులకు పంపబడుతున్నవో రైతులు సమాచారాన్ని తమ విధిగా సంబంధిత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అడిగి తెలుసుకోవాలని అలాగే ఏ మిల్లులోనైనా లారీలను అన్లోడ్ చేసుకోకుండా మిల్లు యజమానులుఇబ్బందులు పెడితే, రైతులుఅట్టి మిల్లు యజమానుల సమాచారం, లారీ నెంబరును కొల్లాపూర్‌లో ఉన్న తన క్యాంప్ ఆఫీసుకు సమాచారమును అందజేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గ రైతులకు సూచించారు. గురువారం క్యాంప్ ఆఫీస్ అధికారుల ద్వారా విడుదల చేసిన ప్రకటనలో ప్రెస్‌నోట్‌ని విడుదల చేశారు. రైతు సమస్యలు ఏమున్నా తమతో పాటు ఆయా జిల్లా కలెక్టర్లకు కూడా తెలియజేసి రైతులు దాన్యం కొనుగోలు సమస్యలు లేకుండా రైతులే సమస్యను పరిష్కరించుకోగలరని మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు రైతులకు తెలియజేశారనీ, వరిధాన్యంకొనుగోలులో ఎక్కడ సమస్యలు ఉత్పన్నమైన వెంటనే సమాచారం ఇవ్వవలసిందిగా జూపల్లి క్యాంప్ ఆఫీస్ అధికారులు ప్రకటనలో ఈ సమాచారాన్ని తెలియజేశారు.

# శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి శోభయాత్ర

**వనపర్తి రూరల్, మే 8 ప్రభాతవార్త:** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని కన్యకా పరమేశ్వరి శోభయాత్ర నిర్వహించారు. గురువారం అమ్మవారి దేవాలయం నుండి శోభాయాత్ర ప్రారంభమై పురివీధుల నుండి కోలాటాలతో అంగరంగ వైభవంగా శోభ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీవాసవి సేవా సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డా. పూరిసురేష్‌శెట్టి, నాగబండి యాదగిరి, మారం బాలీశ్వరయ్య, ఆకుతోటా దేవరాజు, దాచా శివకుమార్, లగిశెట్టి అశోక్, వెంకటయ్య, పూరిపాండు, బచ్చురాము, సి.శ్రీనివాసులు, మహిళా సంఘం కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రథోత్సవం



**మహబూబ్‌నగర్ మే 8 ప్రభాతవార్త:** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి జయంతి ఉత్సవాలు మహబూబ్‌నగర్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం వైభవోపేతంగా రథోత్సవం చేపట్టారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి అమ్మవారి సేవలో తరించారు.